# ఆశ దురాశల కథ

ఏమిట్రా ఏమైంది ?

"ఎవడో జేబు కొట్టేశాడు. వంద రూపాయలు."

"జేబు కత్తిరించాడా?"

"లేదు- వెనకాల జేబులో పెట్టుకున్నాను. ఎవడో లాగేశాడు."

సుందరం మొహం వర్షం వచ్చేముందు ఆకాశంలా, ఆందోళనగా, అశాంతిగా ఉంది.... బస్‌స్టాండ్ రష్‌గా వుంది.

"సార్.... డబ్బులియ్యండి." కండక్టర్ అన్నాడు.

"కొంచెం ఆగండి.... ఎవడో మావాడి జేబు కొట్టేశాడు."

హనుమంతు చెప్పాడు.

"ఆ.... పిక్‌పాకెట్టా- అదేంటిసార్.... అంత అజాగ్రత్తగా ఎలా వున్నారు?"

కండక్టర్ మాట్లాడుతుంటే పాతబస్ స్టార్టయినట్టుగా భయంకరంగా ఉంది. చాలామందికి వినిపించింది.

జనం పోగయ్యారు.

కొందరు సానుభూతి చూపిస్తున్నారు. అందరూ ఇదే విషయం చర్చించుకుంటున్నారు. కొందరు పూర్వం తమకయిన అనుభవాల గురించి చెపుతున్నారు. కొందరు తమకి తెల్సిన అనుభవాల గురించి చెపుతున్నారు.

'దొంగతనాలు, నివారణ, జాగ్రత్తలు' అనే విషయంమీద ఆలిండియా రేడియో వారు చర్చా కార్యక్రమం జరుపుతున్నట్టుగా ఉంది.

సుందరం మొహం ఎండాకాలంలో పచ్చికబీడులా కళాకాంతులు లేకుండా ఉంది.

వంద రూపాయలు పోయాయి.

ఇంకా అక్కడి జనం సుందరం జేబు కొట్టెయ్యడం గురించే మాట్లాడుకుంటున్నారు.

పోడాలు అమ్మేవాళ్ళు, చక్రకేళీలమ్మేవాళ్లు, పాలకోవా అమ్మేవాళ్లు చాలా హడావుడిగా బిజీగా ఉన్నారు.

సుందరం ఇంకా డబ్బుపోయిన షాక్‌లోంచి తేరుకోలేదు.

నీ డబ్బు పోయిందన్న దానికన్నా- నిన్నెవడో యీజీగా బుట్టలో వేసుకున్నాడన్నది ఎక్కువ బాధ.

పాలకోవా అమ్మే కుర్రాడొకడు సుందరానికి కొ_త్త దూరంగా నిలబడి బెదురుచూపులు చూస్తున్నాడు. సుందరం ఆ కుర్రాణ్ని గమనించలేదు.

వాడే తటపటాయిస్తు సుందరానికి దగ్గరగా వచ్చాడు. సుందరం అప్పుడు వాడికేసి చూశాడు.

పదిపన్నెండేళ్లుంటాయి వాడికి. నిక్కరు, చిరుగున్న చొక్కా తొడుక్కున్నాడు.... చేతిలో పాలకోవా పాకెట్లున్న ట్రే ఉంది.

"సార్...." మెల్లిగా అన్నాడు వాడు.

"ఏమిటి?" అన్నట్టు చూశాడు సుందరం పాలకోవా కొనమంటా డేమోనని కోపం రాబోతోంది.

"మీదేకదా డబ్బు పోయింది!"

"అవును. నాదే...." సుందరానికి ఆశ్చర్యం కలిగింది.

"అదిగో- ఆ కళ్ళికొట్టు దగ్గర నిలబడ్డాడు నీలం రంగు చొక్కా. అదే కొట్టేశాడు. నేను చూశాను. అడగండి.... కానీ నే జెప్పినట్టనకండి- తర్వాత నన్ను కొడతాడు." తొందర తొందరగా చెప్పేసి తుర్రుమని వెళ్ళిపోయాడు.

సుందరం నీలం చొక్కా కేసి చూశాడు. నీలం చొక్కా మంచి బట్టలు కట్టుకున్నాడు. షోగ్గా ఉన్నాడు. చూడ్డానికి దొంగలాకాక దొరలా ఉన్నాడు.

సుందరం మెల్లిగా తను విన్న విషయం హనుమంతుకి చెప్పాడు అతను నీలం చొక్కా కేసి తేరిపార చూశాను.

వెంటనే "ఛా! వాడయ్యుండడు. చూడ్డానికి మనకన్నా ఉన్న వాడిలా వున్నాడు" అన్నాడు.

మళ్ళీ హనుమంతే "పోనీ కంట్రోలర్ కి చెప్దాం" అన్నాడు.

సుందరం సరేనన్నాడు.

విషయం కంట్రోలర్ కి చెప్పాడు. అతను నీలం చొక్కా కేసి చూశాడు.

"మీ కనుమానం వుంటే అడుగుదాం!" అన్నాడు.

"మేం అడగలేం! తీరా అతను తియ్యకపోతే గొడవ చేస్తాడేమో? కాని పాలకోవా కుర్రాడు అబద్ధం ఎందుకు చెప్తాడు" అన్నాడు హనుమంతు.

ఆ సమయానికి డ్రైవరు, కండక్టర్ హోటల్నుంచి వచ్చి అక్కడికి చేరుకున్నారు. చాలామంది ప్రయాణీకులు కూడా చల్లగాలికోసం బస్ బైటే నిలబడ్డారు.

కంట్రోలర్ బస్ డ్రైవర్ని పిలిచి ఏదో గుసగుసలాడాడు.

అడిగాక పరిణామాలెలా వుంటాయోనన్న భయం కొద్దిగా ఉన్నా-ఎలాగూ బస్ లో వెళ్ళిపోతాం కదా నన్న ధైర్యం సుందరానికి కలిగింది.

కంట్రోలర్ నీలం చొక్కాని దగ్గరికి పిలిచి "చూడు బాబూ! ఈయన జేబులోని వంద రూపాయలు పోయాయి. కాదు- ఎవరో కొట్టేశారు. ఆ పని నువ్వు చేశావని ఆయనకి అనుమానంగా వుంది. తీస్తే ఇచ్చేయ్" అని చాలా సౌమ్యంగా అన్నాడు.

నీలం చొక్కా- ముందు ఖంగు తిన్నాడు. వెంటనే తేరుకుని

"ఏంటండీ- ఏం మాట్టాడుతున్నారు. నేను కొట్టేశానా? ఏం నేను జేబులు కొట్టేవాళ్లా కనబడుతున్నానా? కాస్త తెలుసుకుని మాట్లాడండి" అన్నాడు.

అతని మాటల్లో తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోడం కన్నా దబాయింపు ఎక్కువగా కనబడింది.

కంట్రోలర్‌కి అనుమానం బలపడింది.

"నువ్వు తీశావని ఆయనకి అనుమానం. పోనీ జేబుతీసి చూపిస్తే పోతుందికదా!" అన్నాడు.

డ్రైవర్ అతని మాటల్ని బలపరిచాడు.

"నేను ఏలూరు వెడదామని బస్ కోసం నుంచున్నాను. బస్టాండులో ఇంతమంది ఉండగా నేనే తీశానని గారంటీ ఏవిటి!" నీలం చొక్కా గొంతు పెంచాడు.

ఈసారి డ్రైవర్ కలుగజేసుకున్నాడు.

"ఆ మాటలన్నీ అనవసరం. జేబు తీసి చూపించు. ఆయనవి కొత్త పది రూపాయల నోట్లు పైగా వరుస నంబర్లవి. నీ జేబులో లేక పోతే ఆయన పొరపాటు ఒప్పుకుని - నీకు క్షమాపణ చెపుతాడు" అన్నాడు.

సుందరం అందుకు వెంటనే ఒప్పుకున్నాడు.

నీలంచొక్కా గొంతు చించుకుని గట్టిగా మాట్లాడుతున్నాడు. వాదిస్తున్నాడు. అపుస్తున్నాడు. కాని జేబు చూపించడానికి ఒప్పుకోడంలేదు.

మాటామాటా పెరిగింది.

పంతాలు పెరిగాయి. జనం వింత చూస్తున్నారు. "నువ్వు మర్యాదగా జేబు చూపిస్తావా- నన్నే జేబులో చెయ్యిపెట్టి వెతకమంటావా?" అనడిగాడు డ్రైవర్.

"ఏంటి జేబులో చెయ్యడతావా? పెట్టు చూస్తాను" నీలంచొక్కా ఛాలెంజి విసిరాడు.

డ్రైవరు మౌనంగా ఛాలెంజి తీసుకున్నాడు.

నీలంచొక్కాని గట్టిగా పట్టుకుని "జేబు వెతకవయ్యా!" అన్నాడు.

నీలంచొక్కా గుంజుకునే లోపల కంట్రోలర్ అతని ప్యాంటు జేబులో చెయ్యిపెట్టి గుప్పిట బయటకు తీశాడు.

కంట్రోలర్ గుప్పిట్లో చిన్న పాకెట్ దువ్వె, మడతపెట్టిన జేబు రుమాలు, అగ్గిపెట్టె, అన్నిటికిందా.... కొత్త పది రూపాయల నోట్లు ఉన్నాయి.

కంట్రోలర్ ఒక్కోనోటు తీసి చూశాడు. అవి పదున్నాయి. పైగా వరుస నెంబర్లో ఉన్నాయి.

"తియ్యలేదంటావురా దొంగ గాడిదా" నీలంచొక్కాని పట్టుకుని డ్రైవర్ నాలుగు బాదాడు.

కంట్రోలర్ మరో నాలుగు బాదాడు.

దొంగతనం చేసినట్టు అతను ఒప్పుకున్నాడు. చుట్టూ జనం.... తలోమాట అంటున్నారు.

"గురుగారూ! వీణ్ని స్టేషన్‌లో అప్పజెప్పుతారా?" అనడిగాడు కంట్రోలర్.

"ఆ.... పోలీసులచుట్టూ ఏం తిరుగుతాంలెండి! ప్రయాణం వుంది కదా!" అన్నాడు సుందరం.

నీలం చొక్కాకి మరో నాలుగు తగిలించి "ఛో వెధవా-" అని చేతులు దుల్పుకున్నాడు కంట్రోలర్.

సుందరం మనసు హాయిగా వుంది. ఆనందంగా వుంది. పోయిన వందరూపాయలు దొరికాయి. పైగా ప్రయాణం హాయిగా చెయ్యొచ్చు. హైద్రాబాద్ వెళ్ళగానే డబ్బుకి తడుముకోనక్కరలేదు.

బస్ బయలుదేరడానికి ఇంకా పైముంది. కంట్రోలర్ మెల్లగా భుజంమీద చెయ్యేసి సుందరాన్ని బస్ అవతలివైపుకి తీసికెళ్ళాడు.

"నేను ఇక్కడి కంట్రోలర్ని.... హిహిహి వంద రూపాయలు దొరికాయికదా! హి.... హి.... దేశమంతా దొంగవెధవలండీ.... కష్టపడి సంపాయిద్దామని ఒక్కడికీ లేదు.... హి.... హి.... ఏదో మీ దయ.... కాస్త టిఫిన్ తిని కాఫీ తాగుతాను.... మీ ఇష్టం 'ఇంత' అని నే చెప్పను. హి....హి.... మీ ఇష్టం...." అతనలా అడగడం సుందరానికి నచ్చకపోయినా.... పోయిన డబ్బు దొరకడంవల్ల, అతనలా నిర్మొహమాటంగా అడగడంవల్ల.... కాదనలేకపోయాడు.

అయిదు రూపాయల నోటు తీసి అతని చేతిలో పెట్టాడు.

సుందరం, హనుమంతుతో కలిసి కిళ్ళీకొట్టు దగ్గరకెళ్ళి సోడా తాగాడు. కిళ్ళీ వేసుకున్నాడు.

కొట్టునుంచి బయటికొస్తుంటే డ్రైవరు కనపడ్డాడు.

"మీరు నిజంగా అదృష్టవంతులు, పోయిన డబ్బు, అందులోను గూడెం బస్టాండులో దొరకడమంటే నిజంగా అదృష్టం.... కళ్ళుమూసి తెరిచేలోపున ఊళ్ళు ఊళ్ళు దాటి వెళ్ళిపోతుంది.... ఆ ఏం లేదు– ఆ దొంగ వెధవని నేనే గట్టిగా దబాయించానుకదా!.... ఏదో మీ ఇష్టం, సిగరెట్లు కొనుక్కుంటాను" అన్నాడు డ్రైవరు.

సుందరం ఓ అయిదు నోటుతీసి డ్రైవర్ చేతిలో పెట్టాడు.

కండెక్టర్ బస్సెక్కి ప్రయాణీకుల్ని ఎక్కమని గంట కొడుతున్నాడు– సుందరం హనుమంతు చెయ్యి పట్టుకుని "వెడతాన్నా" అని చెపుతున్నాడు.

"సార్...."

సుందరం తననే అనుకుని పక్కకి చూశాడు.

పాలకోవా కుర్రాడు.

తన డబ్బు ఎవడు కొట్టేసినదీ ఆచూకీ ఇచ్చిన కుర్రాడు.

"ఆసలు వీడి విషయమే మర్చిపోయాం!" అనుకున్నాడు సుందరం.

సుందరం నవ్వుతూ ఏమిటన్నట్టుగా చూశాడు. "మీ జేబు ఆడు కొట్టేశాడని నేనే చెప్పానుకదా!"

"అవును."

"మరి.... మరి.... మీ పంధా దొరికాయికదా సార్.... ఓ పావలా పెట్టి పాలకోవా పాకెట్ కొనండి సార్!"

సుందరానికి నోట మాటరాలేదు.

కంట్రోలర్ నంగిమాటలు గుర్తొచ్చాయి. డ్రైవర్ సన్నిహితం గుర్తొచ్చింది. కరకరలాడుతున్న కొత్త పదిరూపాయల నోట్లు జ్ఞాపకం వచ్చాయి. ఎకనామిక్స్ జ్ఞాపకం వచ్చింది. మన తత్వశాస్త్రం జ్ఞాపక మొచ్చింది. మార్క్స్ జ్ఞాపకం వచ్చాడు.

పెట్టుబడిదారీ వ్యవస్థ జ్ఞాపకం వచ్చింది. భూమి, ఆకాశం, మనిషి, జన్మ, ఆకలి, అవసరం, ఆశ, నీతి, అవినీతి అన్నీ జ్ఞాపకం వచ్చాయి. "కష్టపడి సంపాయిద్దామని ఒక్కడికీ లేదు."

పాలకోవా కుర్రాడికేసి చూశాడు.

వాడి మొహంలో అమాయకత్వం, ఇంకా దురాశ డామినేట్ చెయ్యని పసితనం....

వాడి ట్రేలోనుంచి ఓ పాకెట్ తీసి విప్పి పాలకోవా బిళ్ళ నోట్లో వేసుకున్నాడు సుందరం.

జేబులోంచి కొత్త పదిరూపాయల నోటు తీసి ట్రేలో వేసి, వాడి జుట్టు నిమిరాడు. చిల్లర లెక్కపెడుతున్న కుర్రాడితో "ఉంచుకో" అని చెప్పి బస్సెక్కాడు.

— "జ్యోతి" జూలై 1984.